ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శనివారం 25 అక్టోబరు 2025

సత్సంగ సదనం వార్షికోత్సవాలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సత్సంగ సదనం వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సదనంలో భక్తులు భగవద్గీత ఉపన్యాసాలు ప్రవచించారు. ఈనెల 25న ప్రభాతభేరి, గీతా పారాయణం, బ్రహ్మశ్రీ లక్ష్మారెడ్డి ప్రబోధనలు చేయనున్నారు. ఈనెల26 నుంచి 31వరకు శ్రీశృంగేరి శారదా పీఠం ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ గర్రెపల్లి మహేశ్వర శర్మ శ్రీమద్భాగవత సప్తాహం నిర్వహించనున్నారు. నవంబరు 1న లిఖిత రామకోటి శ్రీరామ కోటి స్తూపంలో సమర్పించుట, నాగమణి కేశవరావు రుక్మిణీ కల్యాణంపై హరికథ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేడు మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇల్లంతకుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శనివారం మక్కల కొనుగోలు కేంద్రాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు దళారీల బారినపడవద్దని కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కిక్కు లక్కు ఎవరికో ?



- దరఖాస్తులు తగ్గినా ఖజానా గలగల..
- జిల్లాలో 1,381 దరఖాస్తుల ద్వారా ఆదాయం రూ.41.43 కోట్లు
- 2023-25లో 2,036 దరఖాస్తులు.. రూ.40.72 కోట్ల ఆదాయం
- రూ.3 లక్షల దరఖాస్తు ఫీజుతో సిండికేట్‌గా మారిన ఆశావహులు
- సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట వైన్స్‌లకు అధిక దరఖాస్తులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మద్యం దుకాణాల లైసెన్స్ దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. ఈనెల 27న నిర్వహించే డ్రాలో కిక్కు లక్కు ఎవరికి దొరుకుతుంది..? ఎవరికి నిరాశ మిగులుతుంది..? అనే ఉత్కంఠ మొదలైంది. మద్యం దుకాణాల టెండర్ల నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 18న గడువు ముగిసిన అనుకున్న స్థాయిలో దరఖాస్తులు రాలేదు.

బీసీ జేఏసీ బంద్, బ్యాంక్ సెలవుల వంటి కారణాలతో దరఖాస్తుల గడువును 23వ తేదీ వరకు పొడిగించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో దరఖాస్తులు గత లైసెన్స్ పీరియడ్ కంటే తక్కువ వచ్చినా పెరిగిన లైసెన్స్ ఫీజుతో ఎక్సైజ్ శాఖకు ఆదాయం మాత్రం సమకూరింది.

పెరిగిన ఆదాయం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 48 మద్యం దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేశారు. గడువు పెంచిన గతంలో కంటే దరఖాస్తులు తగ్గిన ఈసారి ప్రభుత్వం దరఖాస్తు ఫీజు రూ.3లక్షలు చేయడంతో ఆదాయం మాత్రం పెరిగింది. 2023-25 సంవత్సరానికి సంబంధించిన లైసెన్స్ కోసం 2031 దరఖాస్తుల ద్వారా రూ.40.72 కోట్లు ఆదాయం సమకూరింది. ప్రస్తుతం 2025-27 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 1381 దరఖాస్తులు వచ్చాయి. దీని ద్వారా రూ 41.43 కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లాలో 1381 మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తుల్లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు ఎల్లారెడ్డిపేట మండలంలో మిగతా 8లో..

దుకాణాల వారీగా దాఖలైన టెండర్ దరఖాస్తులు..

దుకాణం నంబరు	దరఖాస్తులు	దుకాణం నంబరు	దరఖాస్తులు
01.	30	25.	23
02.	30	26.	33
03.	28	27.	24
04.	30	28.	19
05.	34	29.	15
06.	42	30.	15
07.	33	31.	21
08.	34	32.	27
09.	40	33.	25
10.	35	34.	20
11.	53	35.	49
12.	21	36.	33
13.	32	37.	32
14.	38	38.	25
15.	46	39.	30
16.	36	40.	31
17.	18	41.	48
18.	18	42.	38
19.	19	43.	23
20.	21	44.	23
21.	21	45.	25
22.	19	46.	32
23.	23	47.	22
24.	29	48	18

కొనుగోళ్ల ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలి

- ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వసతులు కల్పించాలి
- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం, పత్తి, మక్కలు ఇతర పంటల కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో శుక్రవారం ఇన్‌చార్జి కలెక్టర్ కొనుగోళ్లపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంవత్సరం ఏయే పంటల ఉత్పత్తి ఎంత వస్తుందని జిల్లా వ్యవసాయాధికారిని అడిగి తెలుసుకున్నారు. మొత్తం జిల్లాలో 238 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంజూరుచేయగా ఇప్పటివరకు 171 కొనుగోలు కేంద్రాలు ఐకేపీ, సింగిల్‌విండోలు, మెప్మా, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయని, మిగతావి వారం రోజుల్లో ప్రారంభిస్తారని అధికారులు వివరించారు. ఈసందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నాలుగు లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వ్యవసాయ అధికారులు అంచనా వేశారని తెలిపారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రెండు లక్షల 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు వెల్లడించారు. ఈమేరకు అన్ని కొనుగోలు కేంద్రాలల్లో ప్యాడీ క్లీనర్లు, టార్పిన్‌లు, టెంట్‌లతోపాటు నీటి వసతి, విద్యుత్ కనెక్షన్‌లను పక్కాగా ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. గన్నీ సంచుల కొరత లేదని ఇంకా కావాల్సినవి తెప్పించాలని ఆదేశించారు. జిల్లాలో పత్తి కొనుగోళ్లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని సీసీఐ ఆధ్వర్యంలో రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించాలని కోరారు. మక్కల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, ఆయా మండలాల్లో రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్‌డీవో శేషాద్రి, డీసీఎస్‌వో చంద్రప్రకాష్, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

వెంటవెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలి
- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్



రైతుతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

తంగళ్లపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రాల్లో 17శాతం ఉన్న ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం మల్లాపూర్‌లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం కుప్పలను పరిశీలించి ఇప్పటివరకు వరిధాన్యం ఎంత కొనుగోలు చేశారని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ.2369గా నిర్ణయించిందన్నారు. వర్షాల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. గన్నీ సంచులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో శేషాద్రి, డీసీఎస్‌వో చంద్రప్రకాశ్, తహసీల్దార్ జయంత్, ఏపీఎం రజిత సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి జూపల్లి క్షమాపణ చెప్పాలి



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని నేతన్న చౌక్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్‌పై తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్రను పోషించిన కేటీఆర్‌పై మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన ఖండిస్తున్నామన్నారు. కేసీఆర్, కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే భేషరతుగా వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో జిల్లాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మట్టి శ్రీనివాస్, ముందం అనిల్ గౌడ్, ఆడిచర్ల సాయికృష్ణ, అరికె వినయ్‌కుమార్, సంపత్, హర్షిత్‌గౌడ్, ఎండీ అజ్జు, నరేష్, రాము పాల్గొన్నారు.

నిలిచిన తాత్కాలిక మట్టి రోడ్డు పనులు

గంభీరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై కొనసాగుతున్న తాత్కాలిక మట్టి రోడ్డు పనుల నిలిపివేతపై స్థానికులు ఆందోళన చేపట్టారు. మానేరు వాగుపై తాత్కాలిక మట్టి రోడ్డు పనులు గురువారం మొదలైన విషయం తెలిసిందే. ఉన్నట్టుండి శుక్రవారం మట్టి రోడ్డు పనులు ఆగిపోవడంతో గ్రామ పురోహితుడు పార్థసారధిశర్మ ఆధ్వర్యంలో స్థానికులు మానేరు వాగు వద్ద ఆందోళనకు దిగారు. అసలు మట్టి రోడ్డు పనులు ఎందుకు నిలిచిపోయయనే అంశంపై సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో ఆందోళన చేపట్టారు. పనులు మొదలు పెట్టిన మరుసటి రోజే ఎందుకు ఆపారు.. ఎవరు ఆపమన్నారు.. కాంట్రాక్టర్ రావాలి.. అధికారులు రావాలి... అంటూ నినాదాలు చేశారు. నిలిపివేసిన మట్టి రోడ్డు పనులు వెంటనే ప్రారంబించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని స్థానికులు హెచ్చరించారు.

గోదాం ఇన్‌చార్జి పర్యవేక్షకుడికి షోకాజ్ నోటీసు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయ గోదాం ఇన్‌చార్జి పర్యవేక్షకుడు వెంకటప్రసాద్‌కు ఈవో రమాదేవి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. వేములవాడ రాజన్న ఆలయంలో ఈనెల 20వ తేదిన ఆలయ గోదాం సరుకులు పక్కదారి అనే కథనంపై ఈవో సంబంధిత కమిటీని నియమించి విచారణకు ఆదేశించారు. కమిటీ సభ్యులు ఇచ్చిన రిపోర్టు మేరకు సెంట్రల్ గోదాం నుంచి సరుకులు తరలిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు ప్రసారం కావడంతో ఆలయ ప్రతిష్ఠకు భంగం వాటిల్లినట్లుగా ప్రవర్తించినందుకు, గోదాం సామగ్రిలో హెచ్చు, తగ్గులు స్పష్టంగా తేలినందున, విధుల పట్ల నిర్లక్ష్యంతో వ్యవహరించినందుకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ మూడు రోజుల్లో లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలని, లేని పక్షంలో రికార్డును అనుసరించి తగిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

నెరవేరుతున్న పేదవాడి సొంతింటి కల

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్ 8

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం..

- ఆందోళనలో రైతులు



రాచర్లబొప్పాపూర్ మార్కెట్ యార్డు ఆవరణలో తడిసిన ధాన్యం 8

నేరాల దర్యాప్తులో కొత్త పుంతలు

- ఫేస్ రికగ్నిషన్ సిస్టం అమలు - పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ విధానం
- నేరం జరిగిన వెంటనే పట్టుకునే అవకాశం - టీఎస్‌కాప్ యాప్‌నకు వేలిముద్రల అనుసంధానం
- అరచేతిలో నేరస్థుల చిట్టా - సాంకేతిక పరిజ్ఞానంలో పోలీసుల ముందడుగు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నేరాల దర్యాప్తులో పోలీసు శాఖ కొత్తపుంతలు తొక్కుతోంది. నేరం జరిగితేచాలు.. ఇట్టే నేరస్థుడిని పట్టేసే విధంగా ఆధునిక సాంకేతిక వ్యవస్థను వినియోగిస్తుంది. ఇందుకు ఫేస్ రికగ్నిషన్ సిస్టం, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి నూతన సాంకేతిక విధానం, జియో ట్యాగింగ్ వ్యవస్థను వినియోగిస్తున్నారు. అరచేతిలో నేరగాళ్ల చిట్టాను అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టింది. నేరం జరిగిన చోటుకి వెంటనే పోలీసులు వెళ్లేలా చర్యలు చేపట్టింది. ఈ సాంకేతికత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు మార్గదర్శిగా పని చేస్తుంది. నేరాల నియంత్రణకు మొబైల్ డివైస్ స్కానర్ ఎంతో ఉపయోగపడుతుంది. ఈ స్కానర్ ద్వారా ప్రతి పోలీస్‌స్టేషన్‌లో వేలిముద్రల సేకరణ చేసేందుకు అవకాశం ఏర్పడింది. మొబైల్ డివైస్ స్కానర్ ద్వారా సేకరించిన నేరస్థుల వేలిముద్రలను ఫింగర్ ప్రింట్ బ్యూరోతో అనుసంధానం చేశారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌ను కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి మొబైల్ డివైస్ స్కానర్‌ను అందించి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో పోలీసులు మరో ముందడుగు వేశారు. ఈ విధానం ద్వారా గత ఏడాది సిరిసిల్లలో జరిగిన మహిళ హత్య కేసులో ప్రధాన నిందితుడైన బీహార్‌కు చెందిన రూడల్ సదాను ఇటీవల అరెస్ చేశారు. నిందితుడు ఏడాదిగా ఎలాంటి ఫోన్‌లు వినియోగించకుండా తప్పించుకుంటూ తిరుగుతున్నాడు. అయినప్పటికీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని పట్టుకున్నారు. క్రెడిట్ కార్డ్ యాక్టివేషన్ పేరుతో సైబర్ నేరాలకు పాల్పడిన అంతర్ రాష్ట్ర సైబర్ నిందితులైన జార్ఖండ్‌కు చెందిన అంకిత్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఖలీం, అబ్దుల్ రషీద్‌లను కూడా ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి సిరిసిల్ల పోలీసులు పట్టుకున్నారు.



సాంకేతిక పరిజ్ఞానంతో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు(ఫైల్)

గూగుల్ మ్యాప్ సహాయం..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏదైనా సంఘటనలు జరిగితే ఆ ప్రాంతాన్ని గూగుల్ మ్యాప్ సహాయం ద్వారా గుర్తించవచ్చు. జియో ట్యాగింగ్‌లో సంబంధిత పోలీస్‌స్టేషన్ కమాండ్ కంట్రోల్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఫీడ్ చేస్తారు. ఇందుకు జీపీఎస్ పద్ధతిని అమలులోకి తీసుకువస్తారు. ఆ ప్రాంతం ఎంత దూరం ఉందనే కోణంలో పసిగట్టవచ్చు. ఇదంగా జియోట్యాగింగ్ ద్వారా ఇట్టే తెలిసుకునే అవకాశం ఏర్పడింది.

టీఎస్ కాప్ యాప్‌నకు అనుసంధానం..

పోలీస్‌శాఖ టీఎస్ కాప్ యాప్‌నకు జియోట్యాగింగ్ అనుసంధానం చేశారు. ఈ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ఏదైనా చూడవచ్చు. ఈ విధంగా నేరస్థుల చిట్టా అంతా అరచేతిలో ఉంటుంది. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో సిబ్బంది ఎటువెలుతున్నారనేది ఎస్‌హెచ్‌వో పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది.

దొంగతనాలపై నిరంతరం నిఘా..

జియోట్యాగింగ్ ద్వారా దొంగతనాలపై నిరంతరం నిఘా పెట్టవచ్చు. జిల్లాలో ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం జరిగినా ఆ పరిస్థితిని బట్టి వెంటనే పట్టుకునే అవకాశం ఏర్పడుతుంది. ప్రధానంగా దొంగతనాలు జరుగకుండా చర్యలు తీసుకోవచ్చు. జియో ట్యాగింగ్ ద్వారా పాత నేరస్థులు ఏదైనా దొంగతనానికి పాల్పడితే వెంటనే సమాచారం అందుతుంది. దీంతో దొంగతనాలు ఏ ప్రాం తంలో జరిగినా వెంటనే పోలీసులు వెళ్లి పట్టుకునేందుకు సులభం కానుంది.

వేలిముద్రల ఆధారాలతో నేరాల అదుపు..

మానవ శరీరంలో ఒకే ఆకారాన్ని కలిగి ఉండేవి వేలిముద్రలు మాత్రమే. మనిషి వయస్సు పెరుగుతుంటే భౌతిక ఆకృతిలో మార్పు వచ్చినప్పటికీ వేలిముద్రలు స్థిరమైన ఆకారాన్ని కలిగి ఉంటాయి. ఈ వేలిముద్రల ఆధారాలతో నేరాలను అదుపు చేయవచ్చు. గతంలో నేరాల నియంత్రణకు జిల్లా కేంద్రంలో ఉన్న వేలిముద్రల విభాగానికి పరిమితం అయింది. ఇపుడు ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఈ పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకొచ్చారు. నిత్యం వినియోగించే మొబైల్ ద్వారా వేలిముద్రల సేకరించే అవకాశం ఏర్పడింది. మొబైల్ డివైస్ స్కానర్ ద్వారా వేలిముద్రలు సేకరించడానికి సులభం అయింది. ప్రతి మొబైల్‌కి డివైస్ స్కానర్‌ని అనుసంధానం చేసి వేలముద్రలు సేకరించడానికి వీలుకల్పించారు. ఈ వ్యవస్థను సిఐడితో అనుసంధానం చేశారు.

నేరాన్ని సులవుగా గుర్తించేలా రూపకల్పన..

జిల్లాలో ఎక్కడైనా నేరం జరిగినా మొబైల్ డివైస్ స్కానర్ ద్వారా నేరాన్ని గుర్తించేలా రూపకల్పన చేశారు. ఈ వ్యవస్థలో ఇప్పటికే పాత నేరస్థులు, అనుమానితులు, వేలిముద్రలు తదితర వివరాలు పొందుపరిచి ఉంచారు. గతంలో నిర్వహించిన సకల నేరస్థుల సర్వే ద్వారా నేరస్థుల చిట్టాను అందుబాటులోకి తెచ్చారు. ఎవరైనా అనుమానితులు తారసపడినప్పుడు అక్కడికక్కడే వేలిముద్రలు సేకరించి నేరాల నియంత్రణ చేయడానికి వీలుంది. గతంలో నేరం చేసి తప్పించుకొని తిరుగుతున్న నేరస్థులను సులభంగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది.

నేరాల అదుపులో ముందడుగు..


- మహేష్ బి. గీతే, ఎస్పీ, రాజన్న సిరిసిల్ల జిల్లా.



నేరాల అదుపులో ముందడుగువేశాం. జిల్లాలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో నేరస్థులను పట్టుకోవడం సులభం అయింది. గతంలో నేరస్థులను పట్టుకోవడానికి ఎంతో ఆలస్యం అయ్యేది. ఇపుడు ఆ పరిస్థితి లేదు. ఇందుకోసం ప్రత్యేకంగా ఐటి కోర్, ఫింగర్ ప్రింట్ బృందాన్ని ఏర్పరిచాం. నేరాలపై టీఎస్‌కాప్ యాప్‌లో నమోదు చేసి వెంటనే నియంత్రించడానికి ఉపయోగపడుతుంది.

పోలీసులకు వ్యాసరచన పోటీలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసు అధికారులకు, సిబ్బందికి వేర్వేరుగా రెండు కెటగిరిలలో వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా పని ప్రదేశంలో లింగ వివక్ష అనే అంశంపై కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు, నేల స్థాయిలో పోలీసింగ్ బలోపేతం చేయడం అనే అంశంపై ఎస్ఐ నుంచి డీఎస్పీ స్థాయి అధికారులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల అధికారులు, సిబ్బంది, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు మధుకర్, రమేశ్‌లు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న పోలీసులు

గోహంతకులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

వేములవాడ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హిందువులు పూజించే గోమాతలను అక్రమంగా తరలించే వారిపైన పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. వేములవాడ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాము, గౌరిశెట్టి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం


శ్రీనివాస్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని సత్తెపీరీల దర్గా సమీపంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మూల మలుపు వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన కూలీ శివ రాత్రి శ్రీనివాస్(34) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలోని శివ రాత్రి శ్రీనివాస్ దినసరి కూలీ పనులు చేస్తుండేవాడు. స్వగ్రామం నుంచి పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై రాచర్లగొల్లపల్లి వైపు వస్తున్న క్రమంలో సత్తెపీరీల దర్గా మూలమలుపు వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలపాలైన అతన్ని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాస్ చనిపోయాడని నిర్ధారించారు. మృతుడికి తల్లి నర్సవ్వ, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, అరవింద్ ఉన్నారు. మృతుడి సోదరుడు నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య


బుగ్గయ్య(ఫైల్)

ముస్తాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలో అనారోగ్యంతో మనస్థాపం చెంది ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సీహెచ్ గణేశ్ శుక్రవారం తెలిపారు. గ్రామానికిచెందిన మానుక బుగ్గయ్య(70) కొంతకాలంగా అనారోగ్య కారణలతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకు ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో పాము కాటుతో ఇద్దరు మృతి


శంకర్(ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిని పాము కాటు వేయడంతో ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గ మధ్యలో మృతిచెందిన సంఘటన మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్ గ్రామానికి చెందిన దమ్మని శంకరయ్య(39) స్థానిక ప్రియామిల్క్‌లో ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం సాయంత్రం రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోయిన శంకర్‌ను నాగు పాము కాటువేసింది. కుటుంబసభ్యులు వెంటనే 108లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. శంకర్‌కు ఏం కరిచిందో ఇంట్లో వేతికితే నాగుపాము కనిపించింది. దాన్ని స్థానికులు చంపేశారు. మృతుడు శంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పటి వరకు అందరితో కలిసి మెలిసి ఉన్న శంకర్ మృతిచెందడంతో గ్రామంలో విషాద చాయాలు నెలకొన్నాయి.

రూపునారాయణపేటలో డిగ్రీ విద్యార్థిని..


అక్షిత(ఫైల్)

ఓదెల: ఓదెల మండలంలోని రూపునారాయణపేటకు చెందిన అక్షిత(18) అనే డిగ్రీ విద్యార్థి శుక్రవారం ఉదయం పాముకాటుకు గురై మృతి చెందింది. సుల్తానాబాద్ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న అక్షిత బతుకమ్మ పండుగకు ఇంటికి వచ్చింది. శుక్రవారం ఉదయం కాలుపై పాము కాటువేయడంతో గ్రామస్థుడి సలహాతో పాము కాటుకు మంత్రం వేయించేందుకు మరో గ్రామానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో అక్షిత ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో 108అంబులెన్స్‌లో సుల్తానాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి పోలీసులు తెలిపారు.

దారులు అధ్వానం.. రాకపోకలకు నరకం

- ఏళ్ల తరబడి వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

జగిత్యాలరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యా యి. దెబ్బతిని ఏళ్ల గడుస్తున్నా, తారు లేచిపోతున్నా నూతన రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోగా కనీసం మరమ్మతులకు నోచుకోవడంలేదు. గుంతల రహదారులపై ఇబ్బం దుల మధ్య నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రహదారుల మరమ్మతు, నిర్వహణ నుపట్టించుకోలేదని ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


తారులేచి అధ్వానంగా మారిన వెల్దుర్తి రహదారి

దెబ్బతిన్న రహదారులు...

జగిత్యాల జిల్లా కేంద్రానికి అతిసమీపంలో ఉన్న తిమ్మాపూర్-పొలాసకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. పది సంవత్సరాల కిందట నిర్మించిన ఈ రహదారి గోతులు, మట్టి నీటితో నిండిపోయి వాహనదారులకు నరకయాతనగా మారింది. వర్షం పడితే చెరువులా మారుతోంది. కాకతీయ కెనాల్ నీరు నిత్యం రోడ్డుపైనే ప్రవహిస్తోంది. పలుచోట్ల తారులేచిపోయి లోతైన గుంతలు ఏర్పడ్డాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందనలేకపోవడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల మండలం మోతె, జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి, నర్సింగాపూర్, వంజరిపల్లె, హన్మాజీపేట, తిప్పన్నపేట మీదుగా బాలపల్లికి వెళ్లే అంతర్గత రోడ్లు తారులేచి పోయి అధ్వానంగా మారాయి. గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు, రైతులు, విద్యార్థులు, రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే నరకయాతన అనుభవిస్తున్నారు. రైతులు వేకువ జామున జగిత్యాలలోని మార్కెట్‌కు వెళ్లే క్రమంలో రోడ్లపై గోతులు కనబడకపోవడంతో ప్రమాదాలకు బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికా రులు స్పందించి అంతర్గత రోడ్లను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని రహదారులు

మల్యాల: మండలంలో అనేక గ్రామాల్లో గ్రామీ ణ రహదారులు అధ్వానంగా మారాయి. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఈ రహదారులు ఇటీవల ఈ వానాకాలంలో వర్షాలకు మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాల్లో కోతలకు గురి కాగా కొన్ని చోట్ల వర్షపు నీటికి కొట్టుకుపోయాయి. రామన్నపేట నుంచి గొర్రెగుండం వెళ్లేదారి తారులేచి రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. రాంపూర్ నుంచి జగిత్యాల వెళ్లే రహదారికిరువైపులా లోతైన గోతులు ఏర్పడ్డాయి. అలాగే రాంపూర్ నుంచి రామన్నపేటకు వచ్చే మార్గం పనులు నిలిచి కంకర తేలింది. రహదారులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మల్యాల నుంచి సర్వాపూర్, బల్వంతాపూర్, గుడిపేట వెళ్లేదారులు అధ్వనంగా మారడంతో ప్రజలు ప్రయాణానికి పాట్లు పడాల్సి వస్తోంది. మండలంలో సగానికి పైగా గ్రామాల్లోని రహదారుల పరిస్థితి ఇలాగే ఉండగా ప్రజాప్రతినిధులు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా గొర్రెగుండం వెళ్లే దారి

ప్రమాదాల బారినపడుతున్నారు..

- కొడిపల్లి నాగార్జున్, తిమ్మాపూర్



నిత్యం రద్దీగా ఉండే గ్రామాల అంతర్గత రోడ్లు దెబ్బతినడంతో ప్రయాణికులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రమాదాలబారిన పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, గ్రామాల ప్రజలు రోడ్లపై ప్రయాణించడానికి నరకయాతన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారుల నిర్మాణాలు చేపట్టాలి.

తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీ..

సైదాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలో తాళంవేసి ఉన్న ఇళ్లలో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. దుద్దెనపల్లి గ్రామంలో బొరగల్ల నర్సవ్వ, బొరగల్ల రాజయ్య, బొల్లి నరేష్ అనేవ్యక్తులు తమ ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లగా గురువారం రాత్రి తాళాలు పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఇండ్లలోని విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు వారు తెలిపారు. ఈ విషయంపై పోలీసులను వివరాలు కోరగా, పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు.

బంగారు చైన్ అపహరణ

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని గోదావరి నది వద్ద భాగ్య అనే మహిళ పర్స్‌లో నుంచి అర తులం బంగారు చైన్ అపహరించిన సంఘటన శుక్రవారం జరిగింది. దీంతో ఆమె చుట్టు పక్కనే ఉన్న భక్తుల సహాయంతో చైన్ అపహరించిన మహిళను పట్టుకుని పోలీసులకు అప్పగించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటకు చెందిన భాగ్య అనే మహిళ కుటుంబసభ్యులతో కలిసి గోదావరి నది స్నానం కోసం వచ్చింది. స్నానం చేసే సమయంలో స్నానఘట్టాల వద్ద బ్యాగులు, పర్స్ ఉంచి నదిలోకి వెళ్లింది. ఆ సమయంలో భిక్షాటన చేస్తున్న ఒక మహిళ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించింది. సదరు మహిళనే పర్స్‌లో నుంచి బంగారు చైన్ అపహరించిందని పోలీసులకు అప్పగించింది. బాధితురాలు భాగ్య బంగారు చైన్ చోరీ గురించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బంగారు చైన్ చోరీ గురించి పోలీసులు విచారణ చేస్తున్నారు.

హత్యానేరంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి జీవితఖైదు

- ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా
- కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు తీర్పు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ కూతురు ప్రేమించి కులాంతర వివాహం చేసుకుందనే కక్ష పెంచుకున్న ఆమె కుటుంబసభ్యులు చివరకు ఆమె భర్త ఆవునూరు శ్రీనివాస్(31)ని రాళ్లతో కొట్టి హత్యచేశారు. ఈకేసులో నిందితులు నలుగురికి జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి జే కవిత శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.... కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బ్రాహ్మణపల్లికి చెందిన మండల గౌతమి అదే గ్రామానికి చెందిన ఆవునూరి శ్రీనివాస్‌లు ప్రేమించుకున్నారు.

కొంతకాలం వేరే గ్రామంలో నివాసం ఉండి తిరిగి బ్రాహ్మణపల్లికి వచ్చి అక్కడే నివాసం ఉన్నారు. వారికి ఇద్దరు సంతానం కలిగారు. గౌతమి ఇతర కులానికి చెందిన శ్రీనివాస్‌ను వివాహం చేసుకోవటం తండ్రి మండల ఓదెలుకు ఇష్టం లేదు. దీంతో శ్రీనివాస్‌పై కక్ష పెంచుకున్న గౌతమి తండ్రి ఓదెలు(48), సోదరులు మండల సంపత్(28), మండల దేవేందర్(25), తల్లి మండల లక్ష్మి(45)లు గతంలో ఒకసారి దాడి చేయగా గౌతమి తండ్రి, సోదరుడిపై కేసులు నమోద య్యాయి. 2019జూన్ 19న రాత్రి ఆవునూరి శ్రీనివాస్ మద్యం సేవించి తన బైక్‌పై ఇంటికి వస్తూ మార్గ మధ్యలో గౌతమి తండ్రి ఇంటివద్ద బైక్ నిలిపి ఫోన్‌లో గౌతమితో మాట్లాడుతుండగా గౌతమి కుటుంబసభ్యులు నలుగురు శ్రీనివాస్‌పై రాళ్లతో దాడి చేశారు. ఈ రాళ్లదాడిలో శ్రీనివాస్ తలకు తీవ్రగాయాలు కాగా వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు.

ఈ ఘటనపై వీణవంక పోలీసులు గౌతమి కుటుంబ సభ్యులు నలుగురిపై కేసు నమోదు చేయగా జమ్మికుంట రూరల్ సీఐ ఏ రాములు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి గౌతమి తండ్రి ఓదెలు, సోదరులు సంపత్, దేవేందర్, తల్లి లక్ష్మిలకు జీవితఖైదుతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

సైదాపూర్‌లో ఎలుగుబంటి సంచారం

- ఆందోళన చెందుతున్న ప్రజలు

సైదాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని సమ్మక్కగుట్ట వద్ద పెట్రోల్‌బంక్ ముందు నుంచి గురువారం రాత్రి ఎలుగుబంటి సంచరిస్తూ రోడ్డుపైవెళ్తున్న దృశ్యాలు పెట్రోల్ బంక్ సీసీకెమెరాలో రికార్డు అయ్యాయి. ఆ దృశ్యాలు బయటకి రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైతులు రాత్రి బావుల కాడికి కరెంటు పెట్టేందుకు వెళ్తారని, ఎలుగుబంటి సంచారంతో ఇబ్బందులు ఉంటాయని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖాధికారులు ఎలుగుబంటిని బంధించి తీసుకుపోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


సమ్మక్క గుట్ట వద్ద సంచరిస్తున్న ఎలుగుబంటి

మహిళలకు బ్యూటీషియన్ కమర్షియల్ కోర్సుల శిక్షణ

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండీకాలనీలోగల దుర్గాబాయి మహిళాశిశువికాస కేంద్రంలో జిల్లా మహిళానైపుణ్యాభివృద్ధి శిక్షణాసంస్థ కమర్షియల్ పద్ధతిలో 45రోజుల పాటు 15నుంచి 50సంవత్సరాలలోపు మహిళలకు వారి అనుకూల సమయాల్లో బ్యూటీషియన్‌కోర్సుపై శిక్షణను అందించనున్నట్లు కేంద్రం జిల్లామేనేజరు సుధారాణి శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్‌లో వివిధరకాల కోర్సులనుబట్టి ఫీజు ఉంటుందని, ఆసక్తి గల మహిళలు ఆధార్‌జిరాక్స్, రెండు ఫొటోలతో నవంబర్13లోపు ఎల్ఎండీకాలనీలోని తమకార్యాలయంలో దరఖాస్తుచేసుకోవాలని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- తొమ్మిది మందిపై కేసు
- రూ 33,200 నగదు స్వాధీనం

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ఒక గొర్రెల ఫామ్‌లో పేకాట ఆడుతున్న తొమ్మిదిమంది వ్యక్తులను శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.33,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలం నుంచి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే అందిన పక్కా సమాచారం మేరకు ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడిచేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. జూదం ఆడితే కేసులు నమోదుచేసి చట్టరిత్యా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఉదయ్‌కుమార్ హెచ్చరించారు.

మంథనిలోని గంగాపురి శివారులో..

మంథని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గంగాపురి శివారులో పేకాట శిబిరంపై శుక్రవారం దాడిచేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. కొందరు మూడు పత్తాలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేయగా గంగాపురి గ్రామానికి చెందిన మేడిశెట్టి సతీష్, ఓగ్గం అజయ్, దూడపాక రాజశేఖర్, ఎరుకల శేఖర్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.8150నగదు, 4సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న దాడి ప్రణీత్‌కుమార్ తన సెల్‌ఫోన్‌ను తీగలగుట్టపల్లిలో పోగొట్టుకోగా కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ పెద్దపల్లిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి శుక్రవారం ప్రణీత్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్ పిలిపించి సెల్‌ఫోన్‌ను అప్పగించారు. సెల్‌ఫోన్ రికవరీలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

విద్యార్థిని మృతదేహంతో ఎమ్మెల్యే ధర్నా, రాస్తారోకో

హుజూరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద వంగర గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీవర్ష(15) మృతదేహంతో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని పీవీ రంగారావు గురుకుల పాఠ శాలలో హుజూరాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని వి శ్రీవర్ష ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీపావళి పండుగ సందర్భంగా శ్రీవర్ష రాంపూర్ గ్రామానికి రాగా, గురువారం కుటుంబ సభ్యులు శ్రీవర్షను హాస్టల్‌లో వదిలి వచ్చారు. ఈ క్రమంలో హాస్టల్‌లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శ్రీవర్ష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వంగర ఎస్ఐ దివ్య హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఏరియా ఆస్పత్రికి చేరుకొని విద్యార్థిని కుటుంబ సభ్యులను ఓదార్చి, వారితో మాట్లాడారు. అనంతరం విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహాన్ని మోసుకుంటూ అంబేద్కర్ చౌరస్తా వద్దకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ముందస్తుగా పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థిని కుటుంబ సభ్యులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ విద్యార్థిని మృతి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.


విద్యార్థిని శ్రీవర్ష మృతదేహంతో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, నాయకులు

కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి..

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

శ్రీవర్ష కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.కోటి పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతికి కారకులైనా వంగర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. విద్యార్థి మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. శ్రీవర్షది ముమ్మాటికి ప్రభుత్వ హత్య అన్నారు. అనంతరం రాంపూర్ గ్రామానికి వెళ్లి బాలిక కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పత్తి కూలీలపై తేనెటీగల దాడి

- 17 మందికి తీవ్ర గాయాలు

కోనరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 17 మంది పత్తి కూలీలపై తేనెటీగలు ఒకేసారి దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ఘటన కనగర్తి, సుద్దాల గ్రామాల మధ్య జరిగింది. వివరాల్లోకి వెళితే.. వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 17 మంది కూలీలు ఉదయం పత్తి చేనులో పని చేస్తుండగా, సమీపంలోని తేనెపట్టు నుంచి ఒక్కసారిగా తేనెటీగలు వారిపై దాడి చేశాయి. దీంతో కూలీలు భయంతో పరుగులు తీశారు. దాడిలో పలువురు కూలీలు స్పృహ కోల్పోయారు. కూలీల ఆర్తనాదాలు విన్న స్థానికులు, చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారి సహాయంతో గాయపడిన కూలీలను చికిత్స నిమిత్తం వేములవాడ, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తేనెటీగల దాడిలో గాయపడ్డ వారు లావణ్య, సుమలత, దేవేంద్ర, కర్ణ, మమత, లత, తేజ, శృతి, రజితతో పాటు మరో 8 మంది కూలీలు ఉన్నారు. తేనెటీగల దాడిలో గాయపడ్డ వారిని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ప్రజాప్రతినిధులు మంతెన సంతోష్, కచ్చకాయల బాల్‌రెడ్డి, నాలుక సత్యం, ఎరవెల్లి విజయ్, మల్లారెడ్డి, సంజీవ్, రవి, ఉప్పుల గంగయ్య, బుర్ర రమేష్, బొడ్డు రమేష్, సుంకరి రెడ్డి తదితరులు ఉన్నారు.


బాధితులను పరామర్శిస్తున్న మార్కెట్ చైర్మన్ ఎల్లయ్య

పొరండ్లలో జన్మించిన వింత గొర్రె పిల్ల

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొరండ్ల గ్రామంలోని తోడెంగ బాలయ్య అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రె శుక్రవారం వింత గొర్రెపిల్లను జన్మనిచ్చింది. గొర్రె పిల్లకు 3తలలు, 3కండ్లు, 8కాళ్ల ఉన్నాయి. అయితే గొర్రె ఈనే సరికే గొర్రెపిల్ల మృతిచెంది ఉంది.

ఇసుకను తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

కథలాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారిపేట శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడులుచేసి శుక్రవారం పట్టుకున్నారు. ఇసుకను లోడ్‌చేసుకుని వెళ్తున్న సమయంలో గ్రామస్థులు కొందరు గమనించి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో అధికారులు అక్కడికి చేరుకుని వాహనాన్ని పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో..

20 సంవత్సరాల జైలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మానసిక వ్యాధిగ్రస్థురాలైన బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానాతో పాటు బాలికకు నాలుగు లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి (ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు ఫర్ పోక్సో కేసెస్) రత్నపద్మావతి శుక్రవారం తీర్పు వెలువరించారు. కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన బాలికను నిందితుడు ఠాకూర్ అరవింద్ సింగ్ (22) అనే వ్యక్తి అత్యాచారం చేశాడు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి కోరుట్ల సీఐ రాజశేఖర్ రాజు, ఎస్సై సురేందర్ రెడ్డి కేసు విచారణ జరిపి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుకు ఆధారాలు సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టారు. విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

గంజాయి నిందితులకు..

ఏడు సంవత్సరాల జైలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా పండించి అమ్మకానికి యత్నించిన ఇద్దరు నిందితులకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, 20వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జడ్జి నారాయణ శుక్రవారం తీర్పు వెలువరించారు. 2021 అక్టోబరు 25వతేదీన మండలంలోని వర్ష కొండ సమీపంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గిడ్డె వినోద్, జాదవ్ రంజిత్ గంజాయి కలిగి ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. అప్పటి ఎస్సై రాజాప్రమీల అక్కడ తనిఖీ నిర్వహించగా అనుమానితులవద్ద నుంచి 2,200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ కారు, ఐదువేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు గంజాయిని అక్రమంగా పండించి అమ్మకానికి ప్రయత్నించినట్లు తేలింది. నిందితులను పోలీసులు పట్టుకుని సాక్ష్యాలు ప్రవేశపెట్టగా జడ్జి శిక్షను ఖరారు చేస్తు తీర్పు వెలువరించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

విప్‌పై అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

కథలాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌పై ఫేస్‌బుక్‌లో రుద్రంగికి చెందిన గంటె ప్రసాంత్‌యాదవ్ అనేవ్యక్తి అనుచిత పోస్టులు పెట్టాడని కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎస్సై నవీన్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అవమానకర పోస్టులు పెట్టి విప్ ఆత్మగౌరవానికి భంగం కలిగించాడని అతనిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం కోరారు. ఈ సందర్భంగా లింగారావు, రంజిత్, రాములు ఉన్నారు.

నేలమట్టమైన రాజన్న లడ్డూ తయారీ కేంద్రం


లడ్డూ తయారీ కేంద్రం తొలగింపు అనంతరం రాజన్న ఆలయం వెనకభాగం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలోని పురాతన లడ్డూల గోదాం నేలమట్టమైంది. ఆలయ ప్రాకారానికి ఆనుకుని ఉన్న లడ్డూ గోదాం కూల్చివేయడంతో బాలాత్రిపురసుందరీదేవి ఆలయంతో పాటు సోమేశ్వర ఆలయాలు బయటకు కనిపిస్తున్నాయి. ఆలయ అభివృద్ధి పనుల కూల్చివేతలు గురువారం రాత్రి ప్రాకారం గోడలోకి ప్రవేశించాయి. ప్రాకారం లోపల భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు, ఆలయానికి దక్షిణవైపు ఉన్న కోటిలింగాల నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్ల తొలగింపు పనులు చకచకా జరుగుతున్నాయి.

16మంది పిల్లలకు ఓపెన్ హార్ట్ సర్జరీ

సుభాష్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం 15మంది చిన్నపిల్లలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఇమ్యూనైజేషన్ (డీఐవో) అధికారి డాక్టర్ సాజిద తెలిపారు. రెండు రోజులపాటు జిల్లా జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 0 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచిత గుండె సంబంధిత వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్ అపోలో ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 153 మంది పిల్లలు వివరాలను నమోదు చేసుకున్నట్లు, వారికి పరీక్షలు నిర్వహించి 23మందికి చికిత్స అవసరమని గుర్తించినట్లు పేర్కొన్నారు. వారిలో 16 మందికి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరమున్నట్లు, 14మందికి రివ్యూ నిర్వహించనున్నట్లు డీఐవో తెలిపారు.


పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సైనిక్ స్కూల్ పిలుస్తోంది

- 2026-27కు ఎంపిక
- ఈనెల 30లోపు దరఖాస్తులకు అవకాశం



చొప్పదండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రక్షణ రంగాల్లో పని చేయాలనుకునే వారిని సిద్ధం చేసేందుకు భారత రక్షణ శాఖ ఆధ్వర్యంలో సైనిక్‌స్కూల్స్ నడుస్తున్నాయి. ఇవి పిల్లల ఉజ్వల భవిష్యత్‌తో పాటు దేశ సేవ చేసే అవకాశం కల్పిస్తున్నాయి. సైనిక స్కూల్స్ దేశంలోని 33 సైనిక్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులను ఆహ్వానిస్తుంది. సైనిక స్కూల్స్ సొసైటీ ఆలిండియా సైనిక స్కూల్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ (ఏఐఎస్ఎస్ఈఈ) ఆధ్వర్యంలో 6, 9వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. రాత పరీక్ష, మెడికల్ ఫిట్‌నెస్ ఫిజికల్ వెరిఫికేషన్ మెరిట్ లిస్టు ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. అక్టోబర్ 30లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయనగరంలోని కోరుకొండ, చిత్తూరులోని కలికిరిలో సైనిక్‌స్కూల్స్ ఉన్నాయి.

పరీక్ష వివరాలు

- 6వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులు 01-04-2014, 31-03-2016 మధ్యలో జన్మించి ఉండాలి. 9వ తరగతి పరీక్షకు 01-04-2011 నుంచి 31-03-2013 మధ్య జన్మించి ఉండాలి.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే చివరి తేదీ అక్టోబర్ 30. దరఖాస్తులను సరిదిద్దే అవకాశం నవంబర్ 2 నుంచి 4 వరకు అవకాశం కల్పించారు. జనవరిలో ప్రవేశ పరీక్ష జరుగుతుంది.
- పరీక్ష మొత్తం ఓఎంఆర్ పద్ధతిలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 125 ఉంటాయి. 6వ తరగతిలో 300 మార్కుల పేపరు ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు 400 మార్కుల పేపర్ ఉంటుంది.
- విద్యార్థులు ఒకేసారి మాత్రమే దరఖాస్తు చేయాలి. దరఖాస్తు అప్‌లోడ్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు చేయరాదు.
- దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్// ఎగ్జామ్స్.ఎన్‌టీఏ.ఎన్ఐసీ.ఇన్/సైనిక్ స్కూల్స్ సొసైటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.
- తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని రెండు సైనిక్ స్కూల్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.



- ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీలకు 700 రూపాయలు, జనరల్, ఓబీసీ, డిఫెన్స్, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు 850 రూపాయలు.
- ప్రవేశ పరీక్ష 13 ప్రాంతీయ భాషల్లో ఉంటుంది. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.
- ప్రవేశ పరీక్ష జనవరిలో జరుగనుండగా, పరీక్ష తర్వాత నాలుగు నుంచి ఆరు వారాల్లో ఫలితాలను ప్రకటిస్తారు.
- తాజా సమాచారం కోసం విద్యార్థుల తల్లితదండ్రులు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌ను తరచు గమనించాలి.
- ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే విద్యార్థులు ఎన్‌టీఏ హెల్ప్ డెస్క్ నంబర్ 011-040759000 లేదా ఏఐఎస్ఎస్ఇఇ.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్‌కు మెయిల్ ద్వారా సంప్రదించాలి.

అర్బన్ ఎన్నికల్లో 59 నామినేషన్లు ఓకే

- 14 తిరస్కరణ
- నేడు ఉపసంహరణ, తుది జాబితా, గుర్తుల కేటాయింపు

కరీంనగర్‌టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు 12డైరెక్టర్ పదవులకు 73మంది నామినేషన్లు వేయగా వాటిని పరిశీలించిన అధికారులు 14 తిరస్కరించారు. 59నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్. మనోజ్‌కుమార్ ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ ఒకస్థానానికి 9మంది, మహిళా కేటగిరీలో ఏడుగురు, జనరల్ కేటగిరీలో 43 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ధ్రువీకరించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. ఆ తర్వాత తుది జాబితాను విడుదల చేయడంతోపాటు పోటీలోఉన్న అభ్యర్థులకు గుర్తులను కూడా కేటాయించనున్నారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ వరద గేట్లు

జగిత్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పెరగడంతో శుక్రవారం గేట్లు మరోమారు తెరుచుకున్నాయి. ఎగువప్రాంతం నుంచి 22,154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పెద్దింటికి జీవన సాఫల్య పురస్కారం

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సినీ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్‌కు జీవన సాఫల్య పురస్కారం లభించింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన సాహితీవేత్త అమృతలత ఏటా తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన సాహితీ వేత్తలకు జీవన సాఫల్య పురస్కారాలు, అపురూప పురస్కారాలను అందిస్తున్నారు. జీవన సాఫల్య పురస్కారం-2025 సంవత్సరానికి రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సినీరచయిత పెద్దింటి అశోక్ కుమార్‌ను ఎంపిక చేసినట్లు శుక్రవారం ప్రకటించారు. నవంబరు 2న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జీవన సాఫల్య పురస్కారం గ్రహీతలకు రూ.25 వేలు నగదు, ప్రశంసాపత్రాలు, మెమొంటోలను అందజేసి సన్మానిస్తారు. రాజన్నసిరిసిల్లజిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పెద్దింటి అశోక్‌కుమార్‌కు జీవనసాఫల్య పురస్కారం రావడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.


పెద్దింటి అశోక్‌కుమార్

రాజన్న ఖజానాకు రూ.2.19కోట్ల ఆదాయం

- బంగారం 124.50 గ్రాములు, వెండి 10.5 కిలోలు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2,19,35,165నగదు, 124గ్రాముల 500 మిల్లీల మిశ్రమ బంగారం, 10కిలోల 500 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో రమాదేవి వెల్లడించారు. శ్రీరాజరాజేశ్వరస్వామి వారి గత36రోజుల హుండీలను ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య శుక్రవారం ఉద్యోగులు, సిబ్బంది లెక్కించారు. ఈవో రమాదేవి పర్యవేక్షించగా ఏసీ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి, ఏఈవోలు, సూపరింటెంట్‌లు ఉద్యోగులు శ్రీరాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.


ఆలయ హుండీల డబ్బులను లెక్కిస్తున్న సిబ్బంది

కాల్ చేయండి.. సమస్యను పరిష్కరించుకోండి

- విద్యుత్ సమస్యలకు 1912తో చెక్
- టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు


మేక రమేష్‌బాబు, టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ

గణేశ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మీ పరిధిలో కరెంట్ పోయిందా? మీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందా? అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదా? పొలాల్లో వదులు తీగలున్నా అధికారులు సరిచేయ డంలేదా? ఇలా సమస్య ఏదైనా సరే 1912కు కాల్‌చేస్తే వెంటనే సమస్య పరిష్కారం అవుతుందంటున్నారు టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు. 1912 నంబరుకు కాల్ చేస్తే మీటరు నంబరు, ఊరు, పేరు నమోదు చేసుకొని ఒక ఐడీ నంబరు ఇస్తారు. సమస్య పరిష్కారమయ్యే వరకు కాల్‌సెంటర్ సిబ్బంది మీమొబైల్‌లో అందుబాటులో ఉంటారు. ఒకవేళ సమస్యపరిష్కారం కాకపోతే దానికి గల కారణాన్ని వివరిస్తారు.

యాప్ ద్వారా సైతం ఫిర్యాదు

టీజీ ఎన్‌పీడీసీఎల్ సాంకేతికత పెంచడంతో పాటు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. టీజీ ఎన్‌పీడీసీఎల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశముండగా నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సులువుగా గుర్తు ఉండేలా 1912 నంబరును ట్రాన్స్‌ఫార్మర్‌ల మీద ముద్రిస్తున్నారు. ఫిర్యాదు చేయగానే మొబైల్‌కు ఫిర్యాదు నంబరు వస్తుంది. ఆ నంబరు ఆధారంగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతారు. పరిష్కారం ఆలస్యమైతే ఫోన్ చేసి పరిష్కారం ఏ దశలో ఉందో చెబుతారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు అవకశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు తెలిపారు.

కొనసాగుతున్న గోదావరి హారతి


ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురివద్ద గోదావరి హారతి మూడోరోజు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభంనుంచి జరిగే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరంఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు దేశం సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ పూజలు జరిపారు. రాత్రి నదీమాతకు హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలమండలి చైర్మన్ జక్కురవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్త గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు


ట్రోఫీ అందుకుంటున్న కరీంనగర్ జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు శుక్రవారం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని కేహెచ్‌ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. పోటీల్లో అండర్-14 విభాగంలో కరీంనగర్ జిల్లా, అండర్-17 విభాగంలో పెద్దపల్లి జిల్లా జట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించాయి. జట్లకు రాఘవేంద్ర హాస్పిటల్ అధినేత డాక్టర్ శరత్ కుమార్ రెడ్డి ట్రోఫీలను పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బాషబోయిన వేణుగోపాల్, కేహెచ్‌ఆర్ స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డి, సురేందర్‌సింగ్, వ్యాయామ ఉపధ్యాయులు కట్ట సంతోష్, సీహెచ్ శ్రీనివాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి

- యాదవ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొమురయ్య యాదవ్

మానకొండూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదవులు రాజకీయంగా ఎదగాలని యాదవ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సొగాని కొమురయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామ శివారులో ఉమ్మడిజిల్లా యాదవ రాజకీయ శిక్షణ సదస్సు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యాదవులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీపడి రాజకీయంగా పేద ప్రజలకు సేవ చేయాలన్నాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని యాదవులను సంఘటిత పరిచి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. రాజకీయ పార్టీలు యాదవులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్పా వారిని అభివృద్ధి చేయడం లేదన్నారు. ఇప్పటికైనా యాదవులు మేల్కొని రాజకీయాలలో ప్రవేశించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల అధ్యక్షులు నాగారపు సత్యనారాయణ, బల్కం మల్లేశ్ యాదవ్, రాజేందర్ యాదవ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు బూస అంజన్న యాదవ్, రవీందర్ యాదవ్, మల్లేశ్ యాదవ్, కనబోయిన ఓదెలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


ఖాదర్‌గూడెంలో జరిగిన యాదవ రాజకీయ శిక్షణలో అభివాదం చేస్తున్న యాదవులు

కళతప్పిన పల్లె ప్రకృతివనం

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రకృతివనాలపై అధికారుల పట్టింపు కరువైంది. గ్రామాల్లోని ప్రకృతివనాలు దట్టమైన చెట్లు, పిచ్చిమొక్కలతో కళాహీనంగా మారాయి. ఆహ్లాదం పంచేందుకు ఏర్పాటు చేసిన ప్రకృతివనంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మల్యాల బ్లాక్‌చౌరస్తా సమీపంలో గల ప్రకృతివనం మందుబాబులకు అడ్డాగామారింది. క్రీడాపరికరాలు పిచ్చిమొక్కలలో కనిపించకుండా అధ్వానంగా మారింది.


మల్యాలలో అధ్వానంగా మారిన ప్రకృతివనం

దిగువ కొండగట్టులో వెలగని హైమాస్టు లైట్లు

- చీకట్లో ఇబ్బందులు పడుతున్న భక్తులు, స్థానికులు

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని దిగువ కొండగట్టులో హైమాస్టు లైట్లు వెలగడం లేదు. పది రోజులుగా లైట్లు వెలగకపోవడంతో చిమ్మ చీకట్లు అలుముకున్నాయి. దీంతో అంజన్న దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తీవ్రఅసౌకర్యంగా మారుతోంది. బస్సులు, ద్విచక్రవాహనాలు, కార్లు, తదితర వాహనాల్లో వేలాదిగా భక్తులు ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి వెళ్లడానికి దిగువకొండగట్టులోని స్టేజీనుంచి వెలుతుంటారు. అయితే చీకటిపడగానే ఈమార్గం కనిపించకపోవడంతో వాహనదారులు, నడిచివెళ్లే వారు అయోమయానికి గురి అవుతున్నారు. అలాగే స్వామివారి దర్శనం చేసుకొని కొండదిగి వచ్చే భక్తులు దిగువ కొండగట్టులో ఆటవస్తువులు, తీర్థయాత్ర సామగ్రి కొనుక్కోవడం పరిపాటి. కాగా లైట్లు లేక అసౌకర్యానికి గురి అవుతున్నారు. దిగువ కొండగట్టులో నివసించే జనాలు కూడా లైట్లు వెలుగకపోవడంతో చీకట్లతో ఆందోళన చెందుతున్నారు. హైమాస్టు లైట్లకు మరమ్మతులు చేయాలని, కొండ పైవరకు పూర్తి స్థాయిలో లైట్ల వెలుతురు ఉండేలా దేవస్థానం అధికారులు తగుచర్యలు తీసుకోవాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.


హైమాస్టు లైట్లు వెలగక చీకటిమయంగా ఉన్న దిగువ కొండగట్టు ప్రాంతం

మహిళలకు వివిధ కోర్సులలో ఉచిత శిక్షణ

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రంలో 18నుంచి 45సంవత్సరాలలోపు మహిళలకు స్వయం ఉపాధికై వివిధ కోర్సులకు ఉచిత శిక్షణను నవంబర్ 10నుంచి ప్రారంభించనున్నట్లు దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్ర జిల్లా మేనేజరు సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా అందించే కోర్సులు టైలరింగ్, జూట్‌బ్యాగ్ తయారీ, ఈ-ఆటో డ్రైవింగ్, ప్రీప్రైమరీ టీచర్‌ట్రైనింగ్ వంటి కోర్సులలో శిక్షణ పొందేందుకు 25మంది మహిళలకు రెండు నెలల పాటు శిక్షణ, ఉచితహాస్టల్ వసతిఅవకాశం కల్పించనున్నారు. ఆసక్తిగల మహిళలు తమ 7నుంచి 10వ తరగతి ఉత్తీర్ణత ధృవపత్రాలను, ఆధార్‌జిరాక్స్, రెండు ఫొటోలతో నవంబర్ 7లోపు ఎల్ఎండీ కాలనీలోని తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మహిళాప్రాంగణ మేనేజర్ తెలిపారు.

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం

- భీమన్న ఆలయంలో కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- రాజన్న ఆలయంలో కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి, భీమేశ్వర ఆలయాలు శుక్రవారం భక్తజనసంద్రంగా మారాయి. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలను ఏర్పాటు చేయడంతో భక్తులు భీమన్న దర్శనానికి పోటెత్తారు. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్న ఆలయంలోని ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. రాజన్నను దర్శించుకుని ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భీమన్న ఆలయానికి చేరుకున్నారు. దీంతో రాజన్న ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు భీమేశ్వర స్వామిని దర్శించుని కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాజన్న ఆలయం ముందు కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


భీమన్న ఆలయంలో కోడెమొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం..

- ఆందోళనలో రైతులు



రాచర్లబొప్పాపూర్‌లో కొట్టుకుపోయిన ధాన్యం కుప్ప చేస్తున్న మహిళ







ఎల్లారెడ్డిపేటలో తడిసిన ధాన్యం బస్తాలు, గంభీరావుపేట, ముస్తాబాద్‌లలో తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షంతో అన్నదాతలు ఆగమాగమయ్యారు. అరగంటలో నోటి కాడి ముద్ద తడిసిపోయింది. మండల కేంద్రాలతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లతిమ్మాపూర్, రాచర్లగుండారం, పదిర, హరిదాస్‌నగర్, దుమాల, అల్మాస్‌పూర్, రాజన్నపేట, మద్దిమల్ల, అడవిపదిర, గర్జనపల్లి తదితర గ్రామాల్లోని ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం కొట్టుకుపోయింది. తేమ శాతం ఎక్కువగా ఉందని నిర్వాహకులు పేర్కొనడంతో రైతులు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టారు. అకాల వర్షానికి ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసిపోయాయి. ఆరబెట్టిన ధాన్యం వరదకు కొట్టుకుపోయింది. దాంతో రైతులు ధాన్యం ఒక దగ్గరకు చేసేందుకు ఇబ్బందులు పడ్డారు. ఎల్లారెడ్డిపేటలో తూకం వేసిన ధాన్యం సంచులు తడిసిపోయాయి. కేంద్రాల్లో కొనుగోళ్ల జాప్యం వల్ల ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం తడిసి ముద్దయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు కొనుగోళ్లను వేగవంతం చేయడంతో పాటు తడిసిన ధాన్యం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



రుద్రంగిలో తడిసిన ధాన్యం

● ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలంలో కురిసిన అకాల వర్షంతో అన్నదాతలు పండించిన వరి ధాన్యం తడిసిముద్దైంది. శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా కురిసిన వర్షంతో సెంటర్లలో ఆరబోసిన వరిధాన్యం కొట్టుకుపోయింది. ధాన్యం తడిసిపోయింది. తూకానికి సిద్ధంగా ఉన్న వరిధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోల్లు ఆలస్యంగా కావడంతో పరిస్థితి మరింత ఎక్కువైందని ఆందోళన చెందారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోల్లు చేయాలని ఇప్పటికే భారం మరింత ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశలవారీగా కురిసన వర్షంతో రైతన్నల కళ్లలో కన్నీళ్లు మిగిలాయి.

● ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం కురిసిన బారీవర్షంతో కొనుగోలు కేంద్రాలలో రైతులు ఇబ్బంది పడ్డారు. ఆరుగాలం కష్టపడి పండించిన దాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి రైతులు ఆరపెడుతున్నారు. ఒక్కసారిగా వర్షం రావడంతో రైతులు దాన్యంపై టార్పిలిన్ కవర్లు కప్పడానికి కష్టపడివలసి వచ్చింది. ప్రభుత్వం వెంటది వెంటనే దాన్యం సేకరణ చేపట్టాలని రైతులు కోరుచున్నారు.

● గంబీరావుపేట : గంబీరావుపేట మండలంలో శుక్రవారం కురిసిన వర్షానికి వరిదాన్యం తడిసి పోయింది. మండల కేంద్రంలోని కాకుల గుట్ట వద్ద కొనుగోలు కేంద్రం వద్ద వరి దాన్యం వర్షానికి తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

● రుద్రంగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) అకాల వర్షంతో రుద్రంగి మండల కేంద్రంలోనీ కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిసి ముద్దైంది. మండల కేంద్రంలో సాయంత్రం కురిసిన వర్షానికి వ్యవసాయం మార్కెట్ యార్డ్, ప్యాక్స్ సెంటర్ లోని ఆరబోసిన వరి ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ్యాచర్ వచ్చిన ధాన్యంను వెంటనే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

నెరవేరుతున్న పేదవాడి సొంతింటి కల

వేములవాడ రూరల్, అక్టోబ రు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వంలో పేదవాడి సొంతింటి కల నెరవేరుతుందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పోశెట్టి పల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసామన్నారు. వేములవాడ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిస్తామని మోసం చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేదవాడి ఇంటి నిర్మాణం కోసం 5లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నామన్నారు. నిస్సహాయులకు సహాయాన్ని అందించడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వ ర్యంలో ప్రభుత్వం ముందుకుపోతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికే ఒకరోల్ మాడల్‌గా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమి టీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ పార్టీలకు అతీతంగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, పేద ప్రజల భ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గుర్రంవానిపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హజరై లబ్దిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పూరి గుడిసెల్లో, రేకుల షెడ్లల్లో నివసించే వారిని ప్రభుత్వం గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. పేద ప్రజలక గతంలో ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామని, మళ్లీ అధికారంలోకి వచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని గుర్తు చేశారు. ఇల్లు లేని పేద ప్రజల కోసం ఆలోచించి ఇల్లు కట్టి ఇవ్వాలన్న ఆలోచన చేసిన మహోన్నత వ్యక్తి ఇందిరా గాంధీని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, ఆగయ్య, సత్తయ్య, లింగయ్య తదితరులు ఉన్నారు.



గుర్రంవానిపల్లిలో లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేస్తున్న ఆది శ్రీనివాస్

కిక్కు 'లక్కు' ఎవరికో..?

(5వ పేజీ తరువాయి)

అత్యధిక దరఖాస్తులు వచ్చాయి. సిరిసిల్లలో 598దరఖాస్తులు రాగా, వేములవాడలో 354, ఎల్లారెడ్డిపేటలో 354 దరఖాస్తులు వచ్చాయి. జనరల్ కేటగిరి లోని 11వ నంబర్ దుకాణానికి అత్యధికంగా 53 దరఖాస్తులు సమర్పించారు.

డ్రా కోసం ఏర్పాట్లు..

ప్రభుత్వం ఈసారి కొత్త ఎక్సైజ్ పాలసీని తీసుకువచ్చింది. ఈనెల 27న లక్కీ డ్రా ద్వారా దుకాణాల కేటాయింపు తర్వాత కొత్త పాలసీ అమల్లోకి వస్తుంది. ఇందులో భాగంగా టెండర్ దరఖాస్తుల ఫీజు రూ.లక్ష పెంచింది. సిరిసిల్ల జిల్లాలో 48 మద్యం దుకాణాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియలో ఆశావహులు పెరిగిన దరఖాస్తు ఫీజులు దృష్టిలో పెట్టుకొని సిండికేట్‌గా మారి దరఖాస్తులను సమర్పించారు. దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు కావడంతో మొద ట్లో దరఖాస్తులు కూడా తక్కువ రావడంతో ఎక్సైజ్ అధికారులు టెండర్లు వేసే విధంగా విస్తృతంగా ప్రచారం చేశారు. వాట్సాప్‌లో మెస్సేజ్, బ్యానర్ల ద్వారా ప్రచారం చేస్తూ దరఖాస్తులను పెంచే విధంగా శ్రమించారని చెప్పుకోవచ్చు. అయినప్పటికీ గత లైసెన్స్ పీరియడ్‌కంటే 655 దరఖాస్తులు తక్కువ వచ్చా యి. వ్యాపారులు సిండికేట్‌గా మారి జిల్లాలో డిమాండ్ ఉన్న షాపులకు అధి కంగా దరఖాస్తులను సమర్పించారు.

వేతనాలు ఇప్పించాలని వినతి

కోనరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొన్ని నెలలుగా జీతాలు రావడంలేదని జీతాలు ఇప్పించాలని కోనరావుపేట మండలం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీవోకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా జీతాలు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. వెంటనే జీతాలు ఇప్పించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు నరేష్, ఎర్రవెల్లి జ్యోతి, శ్రీనివాస్, తిరుపతి, స్వప్న, రజిత, శశికాంత్ ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చందుర్తి అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని చందుర్తి ఎస్సై రమేష్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా చందుర్తి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మండలంలోని నర్సింగాపూర్, మల్యాల గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6నుంచి 10వతరగతి వరకు విద్యార్థులకు డ్రగ్స్‌పై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



విద్యార్థులకు డిక్షనరీలను అందజేస్తున్న ఎస్సై

ఇల్లంతకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని ఎస్సై సిరిసిల్ల అశోక్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పోలీస్‌శాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శుక్రవారం డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు పాటుపడాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండటమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, సంతోష్‌లతో పాటు పోలీస్‌సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

రుద్రంగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) సోషల్ మీడియాలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మాడిశెట్టి అభిలాష్, కోమిరె శంకర్, తర్రె లింగం, ఎర్రం రాజలింగం, ఇప్ప మహేష్, జక్కు వంశీ, గండి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

30 వరకు 'పది' పరీక్ష ఫీజు గడువు..

కరీంనగర్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అక్టోబరు 30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్, ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో నవంబరు 15 వరకు, 200 రూపాయల రుసుముతో డిసెంబరు 2 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య



సుద్దాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎల్లయ్య



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ తిరుపతి

కోనరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి) : రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. దళారుల చేతిలో మోసపోకుండా రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. ఈ సందర్భంగా ప్యాక్స్ పర్సన్‌ఇన్‌చార్జి రాములు, ఏఎంసీ వైస్‌చైర్మన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాయిని ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు చేపూరి గంగాధర్, నాలుక సత్యం, నిరంజన్‌రావు, కచ్చకాయల బాల్‌రెడ్డి, సంజీవ్, దుప్పల రమేష్, బుచ్చిరాములు, నీరటి రవి, ఉప్పుల గంగయ్య, దొబ్బల దేవయ్య, మంగళ శ్రీనివాస్, బుర్ర రమేష్, మాసం సురేష్, ఉప్పుల అంజయ్య, సీతఈవో రాజేశం, అమర్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : రైతులు దళారులకు దాన్యం విక్రయించి మోసపోవద్దని రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. మండల కేంద్రంతో పాటు మల్యాల, కట్ట లింగంపేట గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చెలుకల తిరుపతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు శ్రమించి పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశం, డైరెక్టర్లు శంకర్, డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం పావన్ కుమా ర్, ఏంఏవో దుర్గరాజు, సీసీ రాజానర్సు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామస్వామి తదితరులున్నారు.

ఉన్నత విద్యనభ్యసించి ఆదర్శంగా నిలవాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ - నేరెళ్ల బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

తంగళ్లపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో స్థిరపడి పలువురికి ఆదర్శంగా నిలవాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల బాలికల గురుకుల పాఠశాలను ఇన్‌చార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ పరిశీలించారు. ఎంత మంది హాజరయ్యారు, సెలవులో ఎంత మంది ఉన్నారు.. తదితర విషయాలపై ఆరా తీశారు. సెలవుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కిచెన్‌లో మెనూ చార్ట్‌ను పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టోర్ రూంలో ఉన్న కూరగాయలు, కోడిగుడ్లు పరిశీలించారు. నాణ్యత లేకపోవడంతో వాటిని సరఫరా చేసే కాంట్రాక్టర్లకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా విద్యాధికారిని ఆదేశించారు. అందుబాటులో ఉన్న సరుకుల వివరాల రిజిస్టరును పరిశీలించారు. విద్యార్థుల వసతి గదులు పరిశీలించి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ మీ అధ్యాపకుల బోధన ఎలా ఉంది..? పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారు..? ఇంటర్మీడియట్ పూర్తయ్యాక ఎవరెవరు ఏయే విభాగాల్లో విద్యను అభ్యసించడానికి ఆసక్తిగా ఉన్నారు..? మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..? అనే వివరాలను క్లుప్తంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థిని నిత్యం విద్యను అభ్యసిస్తూ ఉత్తమ ప్రతిభ కనబచ్చి టీచర్, లాయర్, ఇంజనీర్, డాక్టర్ తదితర రంగాల్లో స్థిరపడాలని, ఆర్థికంగా స్వంతంత్రత సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థిని ఉన్నత స్థానాలకు ఎదిగితే తమ ప్రాంతాలలోని మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తారని స్పష్టం చేశారు. మెనూలో అందించే పోషకాహారం ఖచ్చితంగా తినాలని సూచించారు. కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే నిర్దేశించుకున్న లక్ష్యం సాధించడానికి సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గ్రహించి చదవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీలో తహసీల్దార్ జయంత్, ప్రిన్సిపాల్ రాధ తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్

రాచర్లగుండారంలో బాలుడికి అస్వస్థత

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారంలోని ఏడేళ్ల బాలుడు శివాన్షు గురువారం రాత్రి అస్వస్థతకు గురయ్యాడని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. గ్రామంలోని బాలమణి-దేవేందర్ దంపతుల కొడుకు శివాన్షు ఏడవడం వల్ల స్థానిక ఓ కిరాణ కొట్టులో తినుబండారాన్ని కొనిచ్చారు. సాయంత్రం తిన్న బాలుడు రాత్రి వాంతులు చేసుకున్నాడు. శరీరమంతా దద్దుర్లు రావడం వల్ల ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు స్థానిక ఓ పీఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు సిరిసిల్లకు తీసుకెళ్లారు. బాలుడు ఫుడ్ పాయిజన్ వల్ల అస్వస్థతకు గురయ్యాడని పేర్కొంటున్నారు. గ్రామంలో కాలం చెల్లిన తినుబండారాలను విక్రయిస్తున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన బాలుడిపై కేసు

రుద్రంగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలం సర్పంచ్ తండాకు చెందిన బాలుడు పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సర్పంచ్ తండా గ్రామంలో ఈనెల 21న రాత్రి డీజే సౌండ్ అధికంగా పెట్టడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడటంతో అదే రాత్రి 100 డయల్ కాల్ వచ్చిందన్నారు. పోలీసులు అక్కడికి వెళ్లి డీజే బంద్ చేయాలని చెప్పగా అక్కడే ఉన్న ఓ బాలుడు(16) పోలీసు విధులకు ఆటంకం కలిగించాడన్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్లపై మాంసం వ్యర్థాలతో ఇబ్బందులు



రోడ్డు పడేసిన మాంసం వ్యర్థాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డులో మాంసం వ్యాపారులు వ్యర్థాలను రహదారిపై పడేస్తుండడం వల్ల కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యర్థాలను సంచుల్లో తీసుకుని రోడ్డుపక్కల వేస్తుండడంతో కుక్కలు చేరి వాటిని రహదారులపై లాక్కొస్తున్నాయి. దుర్వాసన భరించలేకపోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పలు వార్డుల్లో జ్వరాల బారిన పడుతున్నామని పేర్కొంటున్నారు. ఓవైపు కంపు వాసన.. మరోవైపు రహదారులపై కుక్కలు గుంపులుగా ఉండి దాడికి దిగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకుని మాంసం వ్యర్థాలపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సీఐకి సన్మానం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను రక్షించిన కామారెడ్డి పట్టణ సీఐ భూక్య నరహరిని ఆయన స్వగ్రామమైన వీర్నపల్లి మండలం లాల్‌సింగ్‌తండాకు చెందిన పలువురు నాయకులు గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. లాల్‌సింగ్‌తండా, అడవిపదిర గ్రామాల్లోని నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సత్కరించారు. వర్షాల నేపథ్యంలో సీఐ నరహరి చూపిన ధైర్యాసాహసాలను కొనియాడారు. నాయకులు భాస్కర్, సంతోష్, లోకనాయక్, గంగారెడ్డి, మదన్ తదితరులు ఉన్నారు.

కూలీలను పరామర్శించిన చల్మెడ



కూలీలను పరామర్శిస్తున్న చెల్మెడ లక్ష్మీనరసింహారావు

కోనరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తేనెటీగల దాడిలో గాయపడ్డ వ్యవసాయ కూలీలను శుక్రవారం బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో పత్తి సేకరించడానికి వచ్చిన వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 17 మంది కూలీలను తేనెటీగలు దాడి చేశాయి. కాగా వేములవాడ, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు మాజీ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, మంతెన సంతోష్, గున్నాల లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి : సీడీపీవో



ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటుతున్న సీడీపీవో

ఇల్లంతకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సీడీపీవో ఉమారాణి పేర్కొన్నారు. మండలంలోని కందికట్కూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాకేనామ్ పర్ ఏక్‌పేడ్ కార్యక్రమంలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలన్నారు. తల్లిపేరు మీద మొక్కను నాటడమే కాకుండా దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో ఎక్కువగా మొక్కలు నాటడం ద్వారా విద్యార్థుల మనస్సులు ప్రశాంతంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, అనువోజు రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రకళ, సూర్యకళ, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లంతకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ పేర్కొన్నారు. ఎస్సై వివరాల ప్రకారం మండలంలోని ఆరెపల్లి గ్రామానికి ఇసుకను తరలించడానికి అనుమతులు పొంది దాచారం గ్రామానికి తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఇల్లంతకుంట పోలీస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుకున్న రెండు ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు శేఖర్, రాజశేఖర్, శ్రీహరిలపై కేసునమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్ రిమాండ్

చందుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పత్తిరి శ్రీధర్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు. ఈనెల 14న మండలంలోని కిష్టంపేట గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తూ ట్రాక్టర్ వదిలి డ్రైవర్ పారిపోగా, యజమాని సద్దుల పవన్‌ను రిమాండ్ పంపామన్నారు. శుక్రవారం ట్రాక్టర్ డ్రైవర్ పత్తిరి శ్రీధర్‌ను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.